# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- దేశంలో ఇప్పటి వరకూ జరిగిన పోలింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా ఓటింగ్ నమోదు అయ్యిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా వెల్లడించారు.
- పల్నాడు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు
- విశాఖపట్నంలో ఈనెల 22, 23 తేదీల్లో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవ వేడుకలు జరగనున్నాయి.
- ఆంధ్రప్రదేశ్ ఈఏపీసెట్ పరీక్ష రేపటి నుంచి జరగనుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఇప్పటి వరకూ జరిగిన నాలుగు దశల సార్వత్రిక ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా ఓటింగ్ నమోదు అయ్యిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా వెల్లడించారు. ఈవీఎంల ద్వారా 80.66 శాతం, పోస్టల్ బ్యాలెట్ 1.2 శాతంతో కలిపి మొత్తం రాష్ట్రంలో 81.86 శాతం పోలింగ్ నమోదయ్యిందన్నారు. విజయవాడలో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో తుది పోలింగ్ శాతం వివరాలను ఆయన వివరిస్తూ... 3 వేల 500 కేంద్రాల్లో సాయంత్రం 6 గంటలు దాటాక కూడా పోలింగ్ కొనసాగిందని అన్నారు. ఆఖరి పోలింగ్ కేంద్రంలో రాత్రి 2 గంటలతో పోలింగ్ ముగిసిందని అన్నారు. కొన్నిచోట్ల వర్షం వల్ల పోలింగ్ ఆలస్యమైందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈవీఎంలన్నీ 350 స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచామన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే 2.09 శాతం పోలింగ్ పెరిగిందని మీనా తెలిపారు. ఈ ఎన్నికల్లో అత్యధికంగా దర్శి అసెంబ్లీ నియోజకవర్గంలో 90.91 శాతం, అత్యల్పంగా తిరుపతిలో 63.32 శాతం నమోదైనట్లు వివరించారు. లోక్‌సభ స్థానాల్లో అత్యధికంగా ఒంగోలులో 87.06 శాతం, అత్యల్పంగా విశాఖ లోక్ సభలో 71.11 శాతం పోలింగ్ నమోదైనట్లు ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = =

పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట - పర్చూరు జాతీయ రహదారిపై ఈరోజు ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ట్రావెల్స్ బస్సును టిప్పర్ ఢీ కొనడంతో ఆరుగురు మరణించగా, 32 మందికి గాయాలు అయ్యాయి. కాగా ఈ ప్రమాద ఘటనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తామని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ అనంతరం జరిగిన హింసాత్మక సంఘంటనలు అరికట్టడంలో వైఫల్యాలకు గల కారణాలను తెలపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలను ఎన్నికల సంఘం ఆదేశించింది. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలను పునరావృతం కాకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారనే వివరాలను కోరింది. ప్రజాస్వామ్యంలో హింసకు ఆస్కారం లేదని ఎన్నికల సంఘం పునరుద్ఘాటించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్నంలో ఈనెల 22, 23వ తేదీల్లో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలి సభ్య కార్యదర్శి బి.వి.ఏ.కృష్ణ మూర్తి తెలిపారు. నగరంలోని ఆంధ్ర విశ్వ కళాపరిషత్ జూబ్లి ఆడిటోరియంలో "ఈ జాతీయ స్థాయి వేడుకలను ప్రణాళికలో భాగం అవ్వండి" అనే నినాదంతో జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ వేడుకల్లో జీవ వైవిద్యానికి సంబంధించిన ప్రముఖ వ్యక్తులు పాల్గొని "జీవ వైవిద్యం ఆవశ్యకత దాని పరిరక్షణకు మానవాళి తీసుకోవాల్సిన జాగ్రత్తలు" అనే అంశంపై ప్రసంగిస్తారని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ జీవ వైవిద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర బయో డైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలో జీవ వైవిద్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో ముఖ్యంగా యువత, విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు, బయో డైవర్సిటీ కన్సర్వేషన్ అవార్డులను అందించడం జరుగుతుందని బి.వి.ఏ.కృష్ణ మూర్తి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రజల కోసం చిత్తశుద్ధితో పని చేసేవారిని తరతరాలు తలచుకొంటాయనడానికి సర్ ఆర్థర్ కాటన్ జీవితమే తార్కాణమని జనసేన పార్టీ అధ్యక్షులు కె. పవన్ కళ్యాణ్ అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఆయనకు పవన్ కళ్యాణ్ అంజలి ఘటిస్తూ... గోదావరి తీరం పచ్చటి మాగాణంగా కళకళలాడడానికి ఆ మహనీయుడు అకుంఠిత దీక్షతో ఆనకట్ట నిర్మాణం చేపట్టడం, సాగు నీటి కాలువలు తవ్వించడమే కారణమని అన్నారు. అందుకే గోదావరి డెల్టా ప్రజలు నేటికీ గోదావరి పుణ్యస్నానం ఆచరించేటప్పుడు కాటన్ ను తలచుకొని ప్రణామాలు అర్పిస్తారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోదావరి డెల్టాలోనే కాకుండా కృష్ణా, తుంగభద్ర తీరాల్లోనూ కాటన్ చేసిన ప్రాజెక్టులు ఉన్నాయని, జల వనరుల ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ విషయంలో అధికారులు, ఇంజినీర్లు సర్ ఆర్థర్ కాటన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్నంలోని ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో మే 21వ తేదీ నుంచి "సమ్మర్ క్యాంప్-2024" నిర్వహిస్తామని క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలియజేశారు. ఈ సమ్మర్ క్యాంప్ లో 5 సంవత్సరాల వయస్సు నుంచి 18 సంవత్సరాల వయస్సు వరకు ఎవ్వరైనా పాల్గొవచ్చు. ఈ సమ్మర్ క్యాంప్ లో భాగంగా చిన్నారులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు వివిధ రకాల కార్యక్రమాలు రూపొందించామన్నారు. బర్డ్ వాచింగ్, గైడెడ్ జూ టూర్, జూ వెటర్నరీ హాస్పిటల్ విజిట్ లాంటి కార్యక్రమాలతో చిన్నారులకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని కూడా అందించేందుకు ఈ

సమ్మర్ క్యాంప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నందనీ సలారియా పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 94408 10213 నెంబరుకు కాల్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసిలలో ప్రవేశాల కోసం నిర్వహించే ఆంధ్రప్రదేశ్ ఈఏపీసెట్ పరీక్ష రేపటి నుంచి జరగనుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రా రెడ్డి తెలిపారు. ఏపీ ఈఏపీ సెట్-2024 పరీక్షను బైపీసీ స్ట్రీమ్ కు మే 16 నుంచి 17 వరకూ 5 సెషన్లలో నిర్వహించనున్నారు. అదేవిధంగా ఎంపీసీ స్ట్రీమ్ కు మే 18 నుంచి 23వ తేదీ వరకూ మొత్తం 9 సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మొత్తం 142 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని, తెలంగాణ రాష్ట్రంలో ఎల్.బీ.నగర్, సికింద్రాబాద్‌లలో కూడా పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎంపీసీ విద్యార్థులు 2 లక్షల 73 వేల 8 మంది, బైపీసీ విద్యార్థులు 87 వేల 421 మంది రెండు స్ట్రీమ్ లు కలిపి 1,121 మంది పరీక్ష రాయనున్నారని తెలిపారు. మొబైల్, బ్లూటూత్ లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమని, ఈ పరీక్షకు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

శ్రీ సత్య సాయి జిల్లాలో 144 సెక్షన్ కొనసాగుతుందని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. జిల్లాలో ఎవరైనా హింసాత్మకమైన ఘటనలకు పాల్పడిన, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించిన, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు, పెళ్లిళ్లు, అంత్యక్రియలకు మినహాయింపు ఇవ్వడం జరిగిందని, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు 144 సెక్షన్ జిల్లాలో అమలవుతుందని మాధవ్ రెడ్డి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

పార్వతీపురం మన్యం జిల్లా, బాలగుడబ గ్రామంలో వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి టి. నారాయణ ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యాక్సిన్ పరిమితి చూసి సకాలంలో అర్హులైన పిల్లలు, గర్భిణీలకు టీకాలు వేయాలని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఈరోజు విశాఖ నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం-నాందేడ్ ఎక్స్ ప్రెస్ రాత్రి 11 గంటల 20 నిమిషాలకు బయలుదేరుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రాత్రి 11 గంటల 20 నిమిషాలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం-ఎల్టిటి ఎక్స్ ప్రెస్ రేపు ఉదయం 6 గంటలకు, అలాగే సాయంత్రం 4 గంటల 45 నిమిషాలకు బయలుదేరాల్సిన బ్రహ్మపూర్ - సికింద్రాబాద్ స్పెషల్ ఎక్స్ ప్రెస్ నాలుగు గంటల 45 నిమిషాల ఆలస్యంగా అంటే ఈరోజు రాత్రి 9 గంటల 30 నిమిషాలకు బయలుదేరుతాయని తెలిపారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = =

తిరుమలలో మే 17వ తేదీ నుంచి 19 వరకు మూడు రోజుల పాటు పద్మావతి శ్రీనివాస పరిణయోత్సవం వైభవంగా నిర్వహించనున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =